# ఎదురుచూసిన క్షణం

"స్మిత బస్ దిగుతూనే చుట్టూ చూసింది భయంభయంగా. అంతా అదొక చీకటితో మూసుకుపోయిన అడవిలా వుంది. 'ఈ చివరి బస్‌లో ఎందుకు వచ్చానా' - అని చీకటి పడుతున్న కొద్దీ ముడుచుకుపోతూనే వుందామె.

పైగా తెలియని ఊరు. కానీ మరీ ఇంత మనుషులు లేనిఊరను కోలేదు.

చేతిగడియారంలో రేడియం డయల్ చూపించిన టైమ్ చూసి ఉలిక్కిపడింది స్మిత. పదిగంటలు దాటింది. అక్కడొక రిక్షాగానీ, బండిగాని ఏమీ లేవు ఘనక మసగ్గా వెన్నెల తప్ప. తననుదింపి కదులున్న బస్‌ను ఓసారి వెనక్కి తిరిగి దిగులుగా చూసింది. స్మిత. ముందు తనొక్కతే దిగింది. ఇంకెవరైనా దిగితే బాగుండనుకుంది - కానీ తను దిగగానే కండక్టర్ 'రైట్' అనేశాడు. బస్ ఒకడుగు ముందుకు వెళ్ళాక కూడా విడిగా బస్ ఆపి ఒక యువకుడు దిగాడు. అనుకోకుండా ఒక్కసారిగా చెప్పలేనంత రిలీఫ్ కలిగింది స్మితకు తెలియని చోట ఒక తోడు దొరికింది. అనుకుంటే భయపడ్తున్న హృదయం కొద్దిగా సేదతీరినట్లయింది. అది ఎడారిలో ఒయాసిస్సును చూసిన అనుభూతి.

బస్సు దిగిన యువకుడు ధీరజ్ సినిమా హీరోలా లేకపోయినా సాధారణమైన ఎత్తు, చామనఛాయ - ఆకర్షణీయమైన వర్చస్సుతో

వున్నాడు. అతను ఆ మసక వెన్నెల్లోనే స్మితను ఆసక్తిగా చూశాడు - తెలుపు రంగులో మెరుస్తున్న శరీర ఛాయతో మెడలో బంగారు గొలుసు పోటీ పడ్తోంది. కవులు కావ్యాల్లో వర్ణించేంత సన్నగా లేకపోయినా చూడగానే పొందిగా ఉన్న నడుము తగినంత ఎత్తుతో తీర్చి దిద్దినట్లున్న సౌష్టవం - చేపల్లాగా లేకపోయినా అందమైన చక్కటి కళ్ళు, కట్టుకున్న లేతాకుపచ్చ షిఫాన్ చీరలో రాత్రిపూట నడచి వచ్చిన వనకన్యలాఉంది- అనుకున్నాడు ధీరజ్.

అంతగా తనను పరిశీలిస్తున్న అతని వైఖరికి సిగ్గుపడింది స్మిత.

కంపెనీ దొరికినందుకు ఆతడికీ ఆనందంగా వుంది. అందులో అందమైన కన్నెపిల్ల. ఒక క్షణంపాటు ఇద్దరూ సందిగ్ధంగా నిలబడి పోయారు. తరువాత ధీరజ్ ప్రశ్నించాడు, 'మీరూ ఊళ్ళోకి వెళ్ళాలా?'

'అవునండి. బాగా చీకటిపడిపోయిందని భయపడ్తున్నాను. అనుకోకుండా మీ కంపెనీ దొరకడం నా అదృష్టం' - అంది స్మిత.

'పదండి మరి నడుద్దాం...'అన్నాడు ముందుకు అడుగులువేస్తూ,

''ఎంత దూరం నడవాలి?'' అతణ్ణి అనుసరిస్తూ ప్రశ్నించింది స్మిత.

"ఓ గంటన్నర సేపు నడవాలి. వాహనాలేం దొరకవు"- చిన్నగా నవ్వి అన్నాడు.

"మైగాడ్' అంది స్మిత ఆదూరాన్ని నడవడం తలుచుకుని- మళ్ళీ ''ఫరవాలేదు మీకు తోడున్నారుగా''అంది నవ్వుతూ.

ధీరజ్ మనస్సు ఆమాటకు పులకరించింది. అతని మనస్సు మరోలా ఆలోచిస్తోంది. ఆమెతో నడుస్తున్న అనుభూతి అద్భుతంగా వుంది. ఆమె ఏవూర్నించి వస్తోందీ, ఏంచేస్తోందీ-ఇవేవి అడగాలన్న తలంపే లేదతనికి. అన్నట్లు ఆమె పేరైనా అడగలేదు.

'ఆమె అందంగాఉంది. పేరు కూడా అందంగానే ఉండి ఉండాలి'" అనుకుంటూ

"ఇంతకీ మీ పేరు చెప్పనే లేదు." అడిగాడు ధీరజ్.

"స్మిత...మరి మీపేరు?—" "అబ్బ! ఇందాకట్నుంచీ గమనించలేదుగానీ స్వరం కూడా ఎంత బాగుందీ కోయిల పలికినట్లు!'

"ధీరజ్ - ధీరజ్ కుమార్ — స్టేట్ బ్యాంక్ లో పన్జేస్తున్నాను—'

కాస్త గర్వంగా అన్నాడు ధీరజ్.

'ఎంతదూరం నడిచినా మనుష్య సంచారమే లేదేం' - కొంతదూరం నడిచాక స్వగతంగా పైకే అనేసింది స్మిత.

ఇప్పుడప్పుడే ఊరు రాకుండా ఉంటే బాగుండునని వుంది ధీరజ్ కి. అన్ని కోణాల్నుంచీ ఆమె అందాల్నే పరికిస్తున్న అతనికి తెలియకుండానే ఏదో మైకంకమ్మేస్తోంది. ఆమె సాన్నిహిత్యంలో మనసు వివశమైపోతోంది. 'ఆమె ఒంపుసొంపులన్నీ తన సొంతమైతే — అహ! తన స్వంతం చేసుకుంటే' - అవును. అంతటాసీరవనిశ్శబ్దం — దరిదాపుల్లో మానవమాత్రుడు లేడు ఇంతమంచి అవకాశం—

"ఏమిటి, మీరేం మాట్లాడడం లేదు- నాకంపెనీమీకు బాగాలేదా?" తలవంచుకుని నడుస్తున్న స్మిత హఠాత్తుగా పక్కకు తిరిగి అన్నది.

"అహఁ భలేవాలే- అదేంలేదు. ఏదో ఆలోచనల్లో వుండిపోయాను- ఇక్కడ మీరు ఎవరింటికి వెళ్ళాలి?' ప్రశ్నించాడు ధీరజ్.

"నళిని-అని స్నేహితురాలు స్కూల్లో టీచరుగావుంది. ఎందుకోతెలియదు-నిన్న హఠాత్తుగా టెలిగ్రామ్ ఇచ్చింది, నన్ను వెంటనే రమ్మని ఈ ఊరసలు నేనింతకు ముందురానేలేదు. ఇంతరాత్రి మీరుండబట్టి కానీ... లేకపోతేనా..." గుండెల మీద చెయ్యి ఉంచుకుని కళ్ళార్పింది, స్మిత. ఆమె ప్రతి కదిలికా అతన్ని ముగ్ధుణ్ని చేస్తోంది.

"కొన్ని ఘటనలు దైవవశాత్తు జరుగుతై మన ఈ కలయికాఅంతే" అన్నాడు ధీరజ్.

"మీరు చాలా మితభాషి అనుకుంటాను."- అంది స్మిత. అప్పుడప్పుడూ మాత్రమే మాట్లాడుతున్న ధీరజ్‌ని చూస్తూ— "అబ్బ! నాకైతే కబుర్లుచెప్పటం మహాసరదా! అవతల వాళ్ళకు బోర్ కొడుతున్నా చెపుతూనేఉంటాను. కొన్నిసార్లు మా నళినినన్ను భలే తిడ్తుంది. 'అవతలివాళ్ళు వింటుంటే మాట్లాడు లేకపోతే కాస్త ఫుల్‌స్టాప్ పెట్టవేతల్లీ'..అంటూ..." అంది గలగలా నవ్వుతూ.

ఆమె కదలికలో, మాటలో ఏదో అందం... ఆమె నవ్వులో అనిర్వచనీయమైన ఏవో భావాలు తొణికిసలాడుతున్నై. ఆమెపట్ల ఆరాధనగా మొలకెత్తినభావం, ఆమెను చూస్తూన్న కొద్దీ క్రమంగా 'ఏదో' పరిణామం చెందుతోంది.

మనస్సులో ఏదో సంఘర్షణ- ఆమె స్పర్శకోసం అతని శరీరం తపిస్తున్నది.

'తగిన సమయం ఇదే తొందరపడమ'ని మనస్సు హెచ్చరిస్తోంది.

'కల్లాకపటం లేని ఆ అమాయకురాల్ని, నిన్ను నమ్ముకున్నదాన్ని అన్యాయం తలపెట్టవద్ద'ని హృదయాంతరాళంలోని నిజాయితీ నసపెడ్తోంది. ఎంత ప్రయత్నించినా ఆమెతో సరిగ్గా మాట్లాడలేక పోతున్నాడు.

"ఏమిటంత దీర్ఘాలోచనలో పడిపోయినారు- యీపరిసరాల్ని మర్చిపోయేలా. ఏమన్నా మాట్లాడండి ధీరజ్"- మళ్ళీ ఆమెనే మాట్లాడింది.

"ఏం లేదండీ- నామనస్సెందుకో బాగాలేదు. మీరేమీ అనుకోవద్దు," క్షమార్పణగా అన్నాడు ధీరజ్. అతనికి చాలా అశాంతిగావుంది ఊరు రావడానికింకా గంట నడవాలి. ఈ లోపలే ఈ అందాన్ని కసిగా అనుభవించాలి.,. క్షణాలు గడుస్తుంటే అవకాశం చేజారి పోతుందేమోనన్న అదుర్దా అతన్ని నడవనీయడంలేదు. ఆ టెన్షన్‌లో నుదుట చెమటపట్టింది. చేతుల్లో సన్నగా కంపన. ఏమైనా సరే ఇంత అందాన్ని ఊరికే వదలకూడదు. ధీరజ్ మనస్సంతా పూర్తిగా స్మిత ఆక్రమించుకొంది. మనస్సులో అతడు దృఢనిశ్చయానికొచ్చాడు... మరో క్షణంఏదో భయం, హఠాత్తుగా ఎవరైనావస్తే...? గుండె ఆ ఆలోచనకే దడదడలాడింది. ధీరజ్ మనస్సులో చెలరేగుతున్న భావాలేవీ ఎరగని స్మిత నిశ్చింతగా అతనితో కలిసి అడుగులేస్తోంది. 'అతడు అతి మంచి అబ్బాయి.'- అన్న అభిప్రాయానికి వచ్చిందామె.

ధీరజ్ మనస్సులో సంఘర్షణ అంతమయింది. హఠాత్తుగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. పువ్వులాంటి మెత్తని ఆమె చేతి స్పర్శకు ఒక్కసారి శరీరంలో రక్తం వేడి హెచ్చింది. స్మిత ఉలిక్కిపడి భయంభయంగా చూసింది ధీరజ్ వంక, బిత్తరపోయినట్లు. అక్కడ వెలుతురే వుంటే అతని కళ్ళల్లో తమకాన్ని చూడగలిగి ఉండేదామె.

అదే క్షణంలో పక్కబాటనుంచి వస్తున్న ఇద్దరువ్యక్తులు మెరుపులా పడ్డారు స్మితమీద. ఇద్దరూ ఆ హఠాత్పరిణామానికి నిర్ఘాంతపోయారు. ధీరజ్ తేరుకుని ఒక్కసారిగా వాళ్ళమీదికి లంఘించాడు. వాళ్ళిద్దరూ బాగా తాగివున్నట్లు వాళ్ళమాటలు వాలకం, వాసనబట్టి గ్రహించాడు ధీరజ్. అతనికి మరింత ధైర్యం వచ్చింది.

స్మిత బిక్కచచ్చిపోయింది. కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ కనిపించని విధిని తిట్టుకుంటోంది. ధీరజ్ బూటుకాలితో ఈడ్చితన్నాడు ఒకణ్ని. ధీరజ్ వాడితో తలపడుతున్నప్పుడు ఇంకోడు స్మితను "రావేచిలకా" అని మోటుగా హత్తుకుని తన పశుత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. స్మిత ఎంత ప్రతిఘటించినా అతనిపట్టు వదిలించుకోలేకపోతోంది ఆమెకు భయంతో అసహ్యంతో ఏడుపు వస్తోంది.

ధీరజ్ తన్నిన తన్నుకు మొదటివాడు కిందపడ్డాడు. వాణ్నింకో రెండు తన్నగానే కుప్పకూలిపోయాడు. అప్పుడు స్మితను పట్టుకున్నవాడిమీదకెళ్ళి రెండు నిమిషాల్లో వాణ్ణి మట్టికరిపించాడు. ఇద్దరూలేచి కాలికి బుద్ధిచెప్పారు.

బాధ దుఃఖం మిళితమైన స్మిత చెదిరినచీర సవరించుకుంటూ కన్నీళ్లతో నిలబడివుంది. ఆమె పక్కన పడ్డ బ్యాగ్ తనచేతిలోకి తీసుకుని ఆమెకందించాడు ధీరజ్, మౌనంగా.

"ఈవేళ మీరు నన్ను రక్షించివుండకపోతే నా బ్రతుకేమైవుండేది- సమయానికి మీరే పక్కన లేకపోతే...అబ్బ! ధీరజ్!... మీ ఋణం ఎట్లా తీర్చుకోను?" దుఃఖం పొంగి పొర్లిరాగా కృతజ్ఞతతో, ఆవేదనతో, ఆర్తితో అతని సమీపంలో, అతనికి చేరువగా అతన్ని పెనవేసుకుని గుండెలు ఎగిసిపడేలా వెక్కి వెక్కి ఏడ్చింది స్మిత. భీతిల్లిన ఆమె మనస్సు అతని గుండెలమీద స్థిమితపడడానికి ప్రయత్నిస్తోంది.

ధీరజ్‌కి మనసంతా మొద్దుబారినట్లయింది. 'ఏం జరిగింది? తనేం చెయ్యాలనుకున్నాడు? ఏంచేశాడు? ఆ సమయానికి వాళ్ళిద్దరే రాకుంటే? నీచులు వాళ్ళా? తనా? ఆమె కృతజ్ఞతకు తను పాత్రుడేనా?' - సిగ్గుతో ఆమెను ఓదార్చడమెలాగో తెలియక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు ధీరజ్.

'భగవాన్! మొదట్లో నా మనసులోకి ప్రవేశించిన నీచభావనకు నన్ను క్షమించు. ఒక అమ్మాయిని ఆపదనుండి రక్షించిన అవకాశమిచ్చిన నీకు నా కృతజ్ఞతలు!' మనస్ఫూర్తిగా దేవుడికి కృతజ్ఞతలర్పించాడు మనసులోనే.

ధీరజ్ ఇప్పుడు స్మితను ఆదరంగా దగ్గరకు తీసుకున్నాడు. కానీ ఆ కౌగిలింతలో ఇదివరకటి, అతన్ని కాల్చిన కామం మచ్చుకైనా లేదు. ఆ స్పర్శలో వేడిలేదు. అతని మనస్సులో ఇంతకు ముందున్న వాంఛ ఏ క్షణం ఆవిరైపోయిందో అతనికే తెలియదు. అతని మనసిప్పుడు నిర్మలంగా ఉంది.

(స్వాతి మాసపత్రిక, జనవరి, 88)